## విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ వేగవంతం చేయండి: కలెక్టర్

**వికారాబాద్,ప్రభాతవార్త :** జిల్లాలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచడంతో పాటు, ఆధార్ అనుసంధానం, అపార్ జనరేషన్, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఎంఈఓ లను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాలోని అన్ని మండలాల ఎంఈఓ లతో విద్యాశాఖకు సంబంధించిన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, ఆధార్ నమోదు అనుసంధానం, అపార్ జనరేషన్ ప్రగతిని సమీక్షించారు. ప్రతి మండల విద్యాశాఖాధికారికి నిర్దిష్ట లక్ష్యాలను కేటాయించి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా ప్రీప్రైమరీ తరగతుల ఎన్‌రోల్‌మెంట్‌తో పాటు 1వ తరగతి విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యార్థుల నమోదు ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం లేకుండా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఆధార్,అపార్ జనరేషన్ ప్రక్రియలను వెంటనే పూర్తి చేసి, సంబంధిత ఆన్‌లైన్ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని తెలిపారు. వికారాబాద్ జిల్లాను విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌లో రాష్ట్రంలో ముందు వరుసలో >>2



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## సన్న బియ్యానికి సున్నం!

### ఆకర్షణీయమైన ప్యాక్‌లతో వినియోగదారులకు వల
### రేషన్ బియ్యాన్ని పాలిష్‌చేసి మిక్స్‌చేస్తున్న వ్యాపారులు
### కల్తీచేసిన బియ్యం అధిక ధరలకు అమ్మకాలు
### పట్టించుకోని అధికారులు

**హైదరాబాద్, ఆగస్టు 21,ప్రభాతవార్త:** మెరిసేవన్నీ బంగారం కావు..అలాగే రంగు రంగుల ఆకర్షనీయమైన సంచుల్లో ఉన్నబియ్యం నాణ్యమైనదనుకంఉటే పొరపాటే..వినియోగదారుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని కొందరు వ్యాపా రులు ఆకట్టుకునే బ్యాగుల్లో నాసిరకం బియ్యాన్ని నింపి విక్రయిస్తున్నారు. గ్రేటర్‌లో కొందరు బియ్యం వ్యాపారుల మాయాజాలానికి ఇదో నిదర్శనం. దూర ప్రాం తాల నుంచి బియ్యాన్ని దిగుమతి చేసుకోవాలంటే ఒకవైపు అధిక ధర, >>2

# వరాల తల్లీ వందనం!







చార్మినార్ వద్ద ప్రసిద్ధ భాగ్యలక్ష్మీ అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



దిల్‌సుఖ్‌నగర్ అష్టలక్ష్మీ ఆలయంలో పూజలందుకున్న అమ్మవారు

★భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు ★మంగళశోభతో గృహసీమలు ముస్తాబు ★పుణ్యక్షేత్రాలలో ఉప్పొంగిన భక్తి తరంగాలు ★ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు ★చల్లగా చూడాలని అమ్మవారికి వేడుకోలు

**ప్రభాతవార్త, నెట్‌వర్క్ :** శ్రావణ మాసం తెచ్చిన మంగళ శోభతో ముస్తాబైన గృహసీమలు, దివ్య శక్తితో వెలిసి పోతున్న ఆలయ ప్రాంగణాలు శుక్రవారం భాగ్యనగరంతోపాటు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పవిత్ర భక్తి పారవశ్యాన్ని నింపాయి. భక్తజనుల హృదయ కమలాల్లో కొలువుదీరిన వరలక్ష్మీ అమ్మవారు, శ్రావణ శుక్రవార మహోత్సవ వేళ దివ్యకటాక్షాన్ని వర్షించారు. వరాలనిచ్చే జగజ్జననిని మనసారా స్మరించారు. కోరికలు తీర్చి, తమ యింట సదా సౌభాగ్య లక్ష్మిగా వెలసియుండమని కోరుతూ వనితలు భక్తిపరవశులై ప్రార్థించారు. ప్రతి ఆలయం కనకాంబరాలు, మల్లెల సువాసనలతో, శ్రీసూక్త పారాయణలు, లలితా సహస్రనామ పారాయణాల మంత్రోచ్చారణలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

భాగ్యనగరంలోని చార్మినార్ వద్ద ప్రసిద్ధ శ్రీ భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆలయ ప్రాంగణం భక్తజన సంద్రంగా మారింది. అమ్మవారి దివ్యాలంకరణను దర్శించి భక్తులు మైమరిచిపోయారు. వందలాది మంది ముత్తయిదువులు పాల్గొని సకల మంగళాలు సిద్ధించాలని కుంకుమార్చనలు, క్షీరాభిషేకాలు అత్యంత నిష్ఠతో నిర్వహించారు. గుల్జారాహౌస్, ఘాన్సీబజార్, పురానాపూల్, దూద్‌బౌలి, హుస్సే ఆలం, లాల్‌దర్వాజ, ఛత్రినాక, గౌలిపుర, మీరాలం మండి, అలియాబాద్, అత్తా పూర్, బంజారాహిల్స్, కోకరివాడితో పాటు పలు ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఉదయం నుంచి రాత్రివరకు భక్తులు మందిరానికి తరలిరావటంతో పరిసర ప్రాంతాలు కిక్కిరిసి పోయాయి.

**ఇంటింట సౌభాగ్య వాయినాలు**

ప్రతి ఇల్లు ఒక దివ్య శక్తిపీఠంలా మారింది. శ్రీదేవికి ఇష్టమైన పిండివంటలు, క్షీరాన్నాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో ధూపదీప నైవేద్యాలు అర్పించారు. పూజానంతరం తోటి ముత్తయిదువులకు తాంబూలాలు, వాయినాలు సమర్పించుకుంటూ అష్టైశ్వర్యాలు, పసుపుకుంకుమలు పదిలంగా ఉండాలని ఆశీస్సులు అందజేసుకున్నారు.

ఆమనగల్లు సత్యసాయి మందిరంలో ఏర్పాటు చేసిన సామూహిక వ్రతాలలో భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదం అందించారు. కార్యక్రమానికి సత్యసాయి సేవా సమితి కన్వీనర్ దొంతు శ్రీనివాస్, డాక్టర్ దొంతు పుల్లయ్య, గోల్డ్ రాము, గోల్డ్ బ్రహ్మం, నాగిళ్ల లింగం, ఎన్.ఆర్. ప్రభాకర్, రామాచారి, అప్పం తిరుపతయ్య, ఆర్టీఏ శేఖర్, శంకర్, అల్లాజి, పోలిశెట్టి శ్రీనివాస్, ఉప్పు శ్రీశైలం, పోలిశెట్టి నందు, గందె శేఖర్, ఆలేటి నారాయణ సార్, కృష్ణారెడ్డి, గాజుల శ్రీనివాస్, గంజి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఆయా గ్రామాల్లో శ్రావణమాస రెండవ శుక్రవారం సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని జరుపుకున్నారు. రావిర్యాల గ్రామంలో కూడా వేడుకలు నిర్వహించారు. షాద్‌నగర్ పరిధిలోని ఎలికట్ట గ్రామంలోని అంబాభవానీ మాత దేవాలయంలో



ఆమనగల్లులో సామూహిక వ్రతాలు చేస్తున్న మహిళలు

ప్రతి శుక్రవారం జరిగే అభిషేకంలో భాగంగా, వరలక్ష్మి వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. షాబాద్ మండల కేంద్రంలోని వెలగపూడి విమలవతి సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో వరలక్ష్మి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలో ఘట్‌కేసర్, శివారెడ్డిగూడ, ఎన్ఎఫ్‌సీనగర్, ఎదులాబాద్, అవుషాపూర్, అంకుశాపూర్, ఘణాపూర్, మర్రిపల్లిగూడ తదితర కాలనీల్లో వరలక్ష్మి వ్రతాలు వైభవంగా నిర్వహించారు. ఘట్‌కేసర్ పట్టణంలో రెండు రోజుల పాటు కొనుగోళ్లతో మార్కెట్ అంతా రద్దీగా మారింది. పూజాసామాగ్రి, గాజులు, కొబ్బరికాయలు, పూలు, పండ్ల విక్రయాలు జోరుగా జరిగాయి.

### అన్యోన్య దాంపత్యంలో
# గృహహింస చిచ్చు!

- వెల్జాల్‌లో వివాహిత అనుమానాస్పద మృతి
- అత్తింటి వేధింపులే ప్రాణం తీశాయని గ్రామస్తుల ఆందోళన
- ఏడు నెలల పసికందును అనాథను చేశారంటూ ఆక్రోశం
- న్యాయం కావాలంటూ భర్త ఇంటి ముట్టడి!
- పెద్దల సమక్షంలో పంచాయితీ..
- చిన్నారి పేరిట 2 ఎకరాల భూమి, 20 లక్షల నగదు ముట్టచెప్పి రాజీ



మృతురాలు మనీషా



అశ్రునయనాల మధ్య మనీషాకు అంతిమ వీడ్కోలు పలుకుతున్న గ్రామస్తులు

**తలకొండపల్లి, ఆగస్టు 21, ప్రభాతవార్త :** కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో ప్రాణాలు కోల్పోయిన సంఘటన రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధి లోని వెల్జాల్ గ్రామంలో చోటుచేసుకుంది. మృతురాలిని కూన మనీషాగా గుర్తించారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. నాగర్ కర్నూలు జిల్లా ఊరుకొండపేట మండలం రామ్‌రెడ్డిపల్లికి చెందిన కల్మచర్ల రామచందర్, కవితల కుమార్తె మనీషాకు, వెల్జాల్ గ్రామానికి చెందిన కూన మణికంఠతో 18 నెలల క్రితం వివాహమైంది. వీరికి 7 నెలల బాబు ఉన్నాడు. పెళ్లయిన ఆరు నెలల వరకు సజావుగానే సాగిన వీరి సంసారంలో, ఆ తర్వాత చిన్నపాటి గొడవలు ప్రారంభమై తరచూ కలహాలకు దారితీశాయి. ఈ క్రమంలో ఈనెల 19న పుట్టింటికి వెళ్లిన మనీషాను భర్త మణికంఠ స్వగ్రామానికి తీసుకొచ్చాడు. అయితే అదే రోజు రాత్రి ఇద్దరి మధ్య మళ్లీ తీవ్రమైన వివాదం చెలరేగింది. మణికంఠ తన భార్యపై తీవ్రంగా దాడి చేసి గాయపరిచాడని గ్రామస్తులు ఆరోపించారు. మరోవైపు, గొడవ కారణంగా ఆమె ఇంట్లోని యాసిడ్ తాగిందని భర్త తెలిపి మహబూబ్ నగర్‌లోని ఎస్వీఎస్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మనీషా మృతి చెందింది.

మనీషా మరణవార్తతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొనడంతో తలకొండపల్లి సీఐ జానకిరామ్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆసుపత్రి నుంచి మృతదేహాన్ని వెల్జాల్ తెచ్చిన అనంతరం ఇరువర్గాల కుటుంబ సభ్యులు మాట్లాడి ఒప్పందం చేసుకున్నారు. 7 నెలల చిన్నారి పేరిట 2 ఎకరాల భూమి, పెళ్లి ఖర్చుల కింద మృతురాలి కుటుంబానికి ..20 లక్షలు ఇచ్చేందుకు మణికంఠ కుటుంబం ఒప్పుకుంది. అనంతరం పోలీసులు శవాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం పూర్తి చేయించారు.

**భర్త ఇంటి వద్ద ఆందోళన**

భర్త, అత్తమామల వేధింపులు, దాడి వల్లే మనీషా ప్రాణాలు పోయాయని ఆరోపిస్తూ గ్రామస్తులు మణికంఠ ఇంటి వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. పోలీసులు పరిస్థితిని సర్దుమణగజేసి, తమ పర్యవేక్షణలో దహన సంస్కారాలు పూర్తి చేయించారు.మృతురాలి తల్లి కల్మచర్ల కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ జానకిరామ్ రెడ్డి తెలిపారు. తన కుమార్తెకు తీవ్ర కడుపునొప్పి ఉండటంతో బాధ భరించలేక యాసిడ్ తాగిందని ఫిర్యాదులో పేర్కొన్నారని, ఆ మేరకు విచారణ జరుపుతున్నామని స్పష్టం చేశారు. కంటికి రెప్పలా చూసుకోవాల్సిన తల్లి లేకపోవడంతో 7 నెలల పసిపాప అనాథగా మిగిలిపోవడంపై స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



సమావేశంలో పాల్గొన్న జోనల్ కమిషనర్ చంద్రకళ,ఇతర శాఖల అధికారులు

# గణేష్ ఉత్సవాలకు రెడీ

### ట్రాఫిక్ నియంత్రణ, ఊరేగింపు మార్గాల పర్యవేక్షణపై జోనల్ కమిషనర్ సమీక్ష

**శంషాబాద్, ఆగస్టు 21,ప్రభాతవార్త :** రాబోయే గణేష్ చతుర్థి ఉత్సవ ఏర్పాట్లపై శంషాబాద్ జోన్, జీహెచ్ఎంసీ పరిధిలోని వివిధ శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీల ప్రతినిధులతో శుక్రవారం శంషాబాద్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ చంద్రకళ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల రద్దీ నిర్వహణ, శాంతిభద్రతలు, ఊరేగింపు మార్గాల పర్యవేక్షణ, కీలక ప్రాంతాల్లో బందోబస్తు వంటి అంశాలపై సమీక్షి ంచారు. జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్, పారిశుద్ధ్య విభాగాల అధికారులు రహదారుల మరమ్మతులు, పారిశుద్ధ్య నిర్వహణ, లైటింగ్, నిమజ్జన ప్రాంతాల్లో అవసరమైన ఏర్పాట్లు, వ్యర్థాల తొలగింపు, నిమజ్జనం అనంతరం శుభ్రపరిచే చర్యలపై వివరించారు. నీటి వనరులు, నిమజ్జన ప్రాంతాల భద్రత, అవసరమైన ముందస్తు జాగ్రత్తలపై నీటిసరఫరా, ఇరిగేషన్ శాఖల అధికారులు సూచనలు చేశారు. విద్యుత్ శాఖ అధికారులు ఊరేగింపు మార్గాలు, నిమజ్జన ప్రాంతాల్లో విద్యుత్ భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ తీగలు, స్తంభాలను ముందస్తుగా తనిఖీ చేయడం, ప్రమాదకర విద్యుత్ లైన్లను సరిచేయడం, తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లు, లైటింగ్ ఏర్పాట్లను పర్యవేక్షి ంచడం, ఊరేగింపు విగ్రహాలు విద్యుత్ తీగలకు తగినంత దూరంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. సమావేశానికి శంషాబాద్ డీసీపీ శ్రీ రాజేష్, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ ఏసీపీలు, స్టేషన్ హౌస్ అధికారులు, సూపరింటెండింగ్ ఇంజినీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, పారిశుద్ధ్య విభాగం అధికారులు, నీటిసరఫరా మండలి అధికారులు, ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులు హాజర య్యారు. భాగ్యనగర్ ఉత్సవ సమితి, బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. ఉత్సవ నిర్వాహకులు తమ సూచనలు, అవసరాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి, అవసరమైన క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వ హించి, ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని జోనల్ కమిషనర్ ఆదేశిం చారు.

ప్రజల భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, పారిశుద్ధం, రహదారుల నిర్వహణ, విద్యుత్ భద్రత, లైటింగ్, నిమజ్జన ప్రాంతాల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గణేష్ ఉత్సవ నిర్వాహకులు, భక్తులు పోలీస్, జీహెచ్ఎంసీ, విద్యుత్, నీటిసరఫరా, ఇరిగేషన్ తదితర శాఖలకు సహకరించాలని, అధికారులు సూచించిన ఊరేగింపు మార్గాలు, సమయాలు, భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జోనల్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు. గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షి తంగా, పరిశుభ్రంగా నిర్వహించేందుకు శంషాబాద్ జోన్, జీహెచ్ఎంసీ అన్ని ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

# ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్లు

### నియోజకవర్గానికి వెయ్యి యూనిట్లు : కలెక్టర్ మనుచౌదరి వెల్లడి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 21, ప్రభాతవార్త :** బిసి మహిళలకు ఉచిత ఆటోమెటిక్ కుట్టు మిషన్ల పంపిణీని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రతి నియోజకవర్గంకు వెయ్యి యూనిట్ల చొప్పున పంపిణీ చేయటానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. ఇంటింటికి ఇందిరమ్మ కుట్టుమిషన్ పథకం-2026-2027 కింద అమలు చేయటం జరుగుతుందన్నారు. ఈ పథకం ద్వారా టైలరింగ్‌పై ఆసక్తి, నైపుణ్యం కల్గి ఉన్న అర్హులైన బిసి మహిళలకు 100శాతం సబ్సిడీతో ఆటోమెటిక్ కుట్టుమిషన్లు అందజేయటం జరుగుతుందన్నారు. ప్రతి కుట్టు మిషన్ యూనిట్ విలువ రూ.12వేలు గా ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. బిసి మహిళలకు స్వయం ఉపాధి కల్పించటానికి >>2

### భూ అక్రమాలపై సమగ్ర
## విచారణ జరపాలి
### బిజెపి డిమాండ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 21, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 22- ఏను వెంటనే ఎత్తివేయాలని, భూ ఆక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని, అక్రమాలకు పాల్పడిన సంబంధిత అధికారులను గుర్తించి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్ వద్ద జిల్లా బిజెపి నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.



కలెక్టరేట్ ముందు ఆందోళన చేస్తున్న బిజెపి నాయకులు

శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద బిజెపి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా బిజెపి నాయకులు కలెక్టరేట్ వద్ద ఆందోళన వ్యక్తం చేసి ఆ తరువాత జిల్లా కలెక్టర్ మనుచౌదరిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. దీనిలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, ఎంబిసి మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, మేడ్చల్ అర్బన్ జిల్లా బిజెపి అధ్యక్షులు గిరివర్ధన్‌రెడ్డి, జిల్లా రూరల్ బిజెపి ప్రధాన కార్యదర్శులు అమరం మోహన్‌రెడ్డి, బిటి.లక్ష్మిలతో పాటు పలువురు జిల్లా బిజెపి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా బిజెపి నాయకులు మాట్లాడుతూ 22ఏను అడ్డుపెట్టుకుని పేదలు, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, తమ స్వంత భూములపై హక్కులు కల్గి ఉన్నప్పటికీ వివిధ రకాల సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. >>2

### సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

**వనస్థలిపురం ఆగస్టు21,ప్రభాతవార్త :** ఆర్థిక లావాదేవీల విషయంలో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై, ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హస్తినాపురంలో నివాసముండే చలి చీమల కిషోర్ బాబు (38) సాఫ్ట్వేర్ ఉద్యోగికి భార్య , ఇద్దరు పిల్లలు ఉన్నారు. గురువారం సాయంత్రం ఇంట్లో >>2



అభిమానులకు స్కూటీలను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకుడు కేకే కృష్ణ

## అభిమానులకు ఎలక్ట్రిక్ స్కూటీలు బహూకరణ

**షాద్‌నగర్, ఆగస్టు 21, ప్రభాతవార్త :** పట్టణంలో నూతనంగా ప్రారంభమైన ఓ ఎలక్ట్రికల్ ఈవీ షోరూం ప్రారంభోత్సవం సందరర్భంగా కాంగ్రెస్ యువ నేత కేకే కృష్ణ తన అభిమానులకు ప్రత్యేక కానుక అందించారు. తన అభిమానులు ముజాహిద్, రాజేష్ గౌడ్, రాజులకు కేకే కృష్ణ స్వయంగా ఎలక్ట్రిక్ స్కూటీలను కొనుగోలు చేసి అందజేశారు. అభిమానుల పట్ల తనకున్న ఆప్యాయతను చాటుతూ, వారి అవసరాలను దృష్టిలో పెట్టుకుని స్కూటీలను అందించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు, తన అభిమానులకు సొంతంగా స్కూటీలు కొనుగోలు చేసి అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. యువతకు ఉపయోగపడే విధంగా ఇలాంటి ప్రోత్సాహక కార్యక్రమాలు చేపట్టడం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై షోరూంను లాంఛనంగా ప్రారంభించారు.

## రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి

**శంషాబాద్, ఆగస్టు 21, ప్రభాతవార్త :** పెద్దగోల్కొండ ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శంషాబాద్ ఫ్యూచర్ సిటి పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సిఐ సురేందర్ రెడ్డి వివరాల ప్రకారం.. నాగరం గ్రామంలో నివాసముంటున్న నెమలిగారి నవీన్‌రాజ్ (45)గత రెండేళ్లుగా అబిటెక్ ఎంటర్‌ప్రైజెస్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం సుమారు 9 గంటలకు ఇంటి నుంచి బయలుదేరి పెద్దగోల్కొండ ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ నంబర్ 15 సమీపంలో పనికి వెళ్లాడు. ఉదయం సుమారు 9.20 గంటల సమయంలో ఓఆర్‌ఆర్‌పై డివైడర్ మధ్యలో ఉన్న చెట్లకు తోటపని చేసేందుకు రోడ్డుపై ప్రమాద సూచిక కోన్లు ఏర్పాటు చేస్తున్న సమయంలో తుక్కుగూడ నుంచి గచ్చిబౌలి వైపు వెళ్తున్న కియా కారు అతివేగంగా వచ్చి వెనుక నుంచి నవీన్‌రాజ్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడి ఎడమ కాలు, ఎడమ చేయి విరగడంతో పాటు తలకు తీవ్ర రక్తగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించారు. ప్రమాదానికి కారణమైన కియా టిజి07ఎపి6558 కారు డ్రైవర్ ఇందుకూరి వెంకట శివ ప్రణీత్ వర్మ (23)గా పోలీసులు గుర్తించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



డీఆర్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న బిజెపి నాయకులు

## నిషేధిత జాబితాలో పేదల పట్టా భూములు తొలగించాలి

**వికారాబాద్,ప్రభాతవార్త :** 22-ఎ నిషేధిత జాబితాలో చేర్చిన పేదల పట్టా భూములను తొలగించాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు యు.రమేశ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ విషయమై బీజేపీ నాయకులు శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌ఓ)కు వినతిపత్రం సమర్పించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని బీజేపీ జిల్లా అధ్యక్షులు రమేశ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వికారాబాద్ అసెంబ్లీ కోఆర్డినేటర్ వడ్ల నందు, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు కోకట్ మాధవ రెడ్డి, నాయకులు, విజయభాస్కర్‌రెడ్డి, రాములు, వివేకానంద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భూ అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి

(మొదటి పేజీ తరువాయి)

తప్పిదాలకు పాల్పడినట్లు విచారణలో తేలిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవటంతో పాటు వారిని సస్పెండ్ చేయాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థలో తీసుకుంటున్న నిర్ణయాలపై ప్రజల్లో అనేక అనుమానాలు, ఆందోళనలు కల్గిస్తున్నట్లు తెలిపారు. పేద ప్రజలకు న్యాయం చేయాల్సిన ప్రభుత్వం ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు విమర్శించారు. భూ వ్యవహారాల్లో అక్రమాలు, భూకబ్జాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్న ఆరోపణలపై సిఎం సమగ్ర విచారణకు ఆదేశించి ప్రజలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి నైతిక బాధ్యత వహించాలని రాజీనామా చేయాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. రానున్న నగర మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని వారు అన్నారు. 22ఏను ఎత్తివేయాలని, భూఅవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. ప్రజల భూములు, వారి హక్కుల పరిరక్షణ కోసం బిజెపి నిరంతరం పోరాటం చేస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు తిరుమలరెడ్డి, వెంకట్‌రెడ్డి, రాష్ట్ర నాయకురాలు ఎన్.హైమారెడ్డి, నాగారం మాజీ చైర్మన్ కె.చంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి వి.హనుమాన్, జిల్లా మీడియా కన్వీనర్ చల్వాది ప్రవీణ్‌రావు, కీసర మండల అధ్యక్షులు బాల్‌రాజ్, నాగారం అధ్యక్షులు నాగరాజ్, ఘట్‌కేసర్ అధ్యక్షులు బసవరాజ్, పలు మండలాల, మున్సిపాల్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటింటికీ ఇందిరమ్మ కుట్టు మిషన్లు

(మొదటి పేజీ తరువాయి)

ఆర్థిక స్వాలంభన కల్పించే ఉద్దేశంతో ఇంటింటికి ఇందిరమ్మ కుట్టుమిషన్ పథకం ఉపయోగపడుతుందన్నారు. ఈ పథకం పొందటానికి జిల్లాకు చెందిన బిసి వర్గానికి చెందిన బిసి నిరుద్యోగ మహిళ అయి ఉండాలన్నారు. పేద,నిరుపేద, నిరాశ్రయ,ఒంటరి మహిళలు, వితంతులు, అనాధ మహిళలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. రేషన్‌కార్డు, ఫుడ్‌సెక్యూరిటీ కార్డు, కల్గి ఉండాలన్నారు. లేని పక్షంలో ఆదాయ దృవీకరణ పత్రం సమర్పించాలన్నారు. వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతం వారికి రూ.2లక్షలు మించకూడదని అన్నారు. వయస్సు 18నుంచి 55సంవత్సరాల మధ్య వారు ఉండాలన్నారు. ఆధార్ లేదా ఓటరు ఐడి కార్డు తప్పనిసరి అని అన్నారు. నివాస దృవీకరణపత్రం, ఆధార్‌కార్డు తప్పనిసరి అని అన్నారు. ఒక కుటుంబానికి ఒక యూనిట్ మాత్రమే మంజూరు చేయనున్నట్లు తెలిపారు.



కలెక్టర్ మనుచౌదరి

టైలరింగ్ నైపుణ్యం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మేర, మేరు కమ్యూనిటీ వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. ఆన్‌లైన్‌లో ధరఖాస్తులు అర్హులైన బిసి మహిళలు టిజిఒబిఎంఎంఎస్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. పైన పేర్కొన్న అవసరమైన దృవపత్రాలు, సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులు ధరఖాస్తు వెంట సమర్పించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అయితే గతంలో 2023-24సంవత్సరంలో ప్రయోజనం పొందిన వారు తిరిగి ధరఖాస్తు చేసుకోవటానికి అనుమతించబడదని అన్నారు. ఒక కుటుంబంలో ఒకరు మాత్రమే దరఖాస్తుచేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవటానికి చివరి గడువు సెప్టెంబర్ 15వ తేదీ ఉన్నట్లు కలెక్టర్ సూచించారు.

ఈ విషయంపై జిహెచ్‌ఎంసి, మున్సిపల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, బిసి సంక్షేమ అధికారులను మరిన్ని వివరాలకు సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

# డంపింగ్ యార్డు రద్దు కోసం చట్టసభల్లో పోరాటం చేస్తా

### ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి

**షాద్‌నగర్, ఆగస్టు 21, ప్రభాతవార్త :** కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రామంలో ఏకో టౌన్ పేరుతో డంపింగ్ యార్డుకు సబంధించి 641 జివో రద్దు కోసం చట్టసభల్లో పోరాటం చేస్తానని స్థానిక సంస్థల శాసన మండలి సభ్యులు నవీన్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు శుక్రవారం ఎమ్మెల్సీని కలిసి తమ సమస్యలను వివరించారు. సిద్ధాపూర్ గ్రామం పచ్చని పంట పొలాలతో కళకళలాడుతూ ఉంటుందనీ, ఈ ప్రాంతం కూరగాయల ఉత్పత్తికి ప్రసిద్ధి. జిల్లాలో ఎక్కడా లేని పశు సంపద ఈ ప్రాంతం యొక్క సొత్తు, ఇక్కడి ప్రజానీకం వ్యవసాయం మరియు పాడి సంపద మీదనే ఆధారపడి జీవిస్తున్నారు. ఈ ప్రాంతంలో అమెజాన్, నాట్కో, ఎమ్ఎసెన్, మైక్రోసాఫ్ట్, పోకర్న లాంటి పేరెన్నిక గల భారీ పరిశ్రమలు ఉన్నాయి. ముస్లింలు మరియు హిందువులు పవిత్రంగా భావించే జహంగీర్ పీర్ దర్గా అలానే అనేక ప్రాచీన దేవాలయాల పవిత్రతకు ఈ డంపింగ్ యార్డు వలన భంగం వాటిల్లుతుందనీ అన్నారు. సిద్ధాపూర్‌తో పాటు సుమారు 50 గ్రామాల ప్రజల జీవన విధానం పై ప్రభావం చూపే ఈ డంపు యార్డును రద్దు చేయాలని, జీవో ఆర్టీ నెంబర్ 641 ను వెనక్కి తీసుకునేలా ప్రభుత్వంపై ప్రజల పక్షాన చట్ట సభల్లో పోరాటం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎల్లప్పుడూ ప్రజాపక్షాన నిలబడతా అని, సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డు రద్దు కోసం ప్రస్తుతం జరుగుతున్న పోరాటం సరిపోదని, పోరాటాన్ని ఉధృతం చేయాలని జేఏసీ నాయకులను కోరారు. జేఏసీ ఎలాంటి పోరాట కార్యక్రమాలు నిర్వహించినా తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని



ఎమ్మెల్సీకి వినతి పత్రం అందజేస్తున్న డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు

తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా పోరాటంలోకి వచ్చేవిధంగా జేఏసీ కృషి చేయాలని, రాజకీయాలకు అతీతంగా యువతను ఈ ఉద్యమంలోకి వచ్చేవిధంగా అవగాహన కల్పించాలని, రాష్ట్రంలో రాజకీయ భవిషత్ యువతదే అన్నారు. జేఏసీ కోరిన విధంగా చట్ట సభలో సిద్ధాపూర్ డంపింగ్ యార్డు రద్దు కోసం ప్రభుత్వం పై పోరాటం చేస్తానని మాట ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్ధాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ మూడావత్ రాంబాల్ నాయక్, కన్వీనర్ పినపాక ప్రభాకర్, కో ఆర్డినేటర్ తిరుమలయ్య,కో చైర్మన్లు బోధనం శ్రీనివాస్ రెడ్డి, వడ్డే బాలయ్య, ఈశ్వర్ నాయక్, భూక్యా రజిత కో కన్వీనర్లు రవీంద్రనాథ్, అర్జునప్పు, శ్రీకాంత్, ఆకాష్ నాయక్, మహేష్, సలహాదారులు అబ్దుల్ రబ్ జామి, నాయకులు నక్కల వెంకటేష్ గౌడ్, మహేష్, రవి, శ్రీను, పాండు తదితరులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్య హేయనీయం

**షాద్‌నగర్, ఆగస్టు 21, ప్రభాతవార్త :** ప్రిన్సిపాల్ రూపారెడ్డి దారుణ హత్య తీవ్రంగా కలచివేసిందని బీజేపీ రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేసిన ఒక గురువును కోల్పోవడం అత్యంత విషాదకరమని పేర్కొంటూ రూపారెడ్డికి కన్నీటి నివాళులు అర్పించారు. ఈ ఘటన కేవలం ఒక కుటుంబానికి జరిగిన విషాదం మాత్రమే కాదని, ప్రభుత్వ వైఫల్యం, సామాజిక వైఫల్యానికి అద్దం పడుతోందని విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులకు పూర్తి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్యతో పాటు మానవత్వం, క్రమశిక్షణ, సహనం, గురువుల పట్ల గౌరవం వంటి విలువలను నేర్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. మనందరం ఉపాధ్యాయులకు అండగా నిలుద్దాం. గురువును గౌరవిద్దాం.. గురువు భద్రతను కాపాడుదాం అని



రూపారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పిలుపునిచ్చారు. రూపారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, హృదయపూర్వక సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఇసునాథి శ్రీనివాస్, జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు మోహన్ సింగ్ నాయక్, టౌన్ ఉపాధ్యక్షుడు అల్లం అనిల్ గౌడ్, హాజపల్లి ఉప సర్పంచ్ గంగాధర్, బీజేపీ కంటెస్టెడ్ కౌన్సిలర్ సభ్యుడు గజ్జల ప్రవీణ్, బీజేపీ సీనియర్ నాయకులు సుధాకర్ అప్ప, కృష్ణ యాదవ్, వెంకట్ రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.



వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించిన సిరిసిల్ల రాజయ్య తదితరులు

## మహా కుంభాభిషేకం ఏర్పాట్లపై మాజీ ఎంపి సమీక్ష

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ పరిధి వెంకటాపూర్‌లోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని శుక్రవారం మాజీ ఎంపీ, తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సందర్శించి స్వామివారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రె రాజేశ్ మాజీ ఎంపీకి స్వాగతం పలికారు. మాజీ ఎంపీ స్వామి వారిని దర్శించుకున్న అనంతరం మహా కుంభాభిషేకం కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యులు సిహెచ్. కృష్ణ, ఆర్. అరుణ్ తేజ, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ.కృష్ణారెడ్డి, మాజీ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మెట్టు గణేశ్‌యాదవ్, భోజిరెడ్డి, కె. వినోద్ కుమార్, లక్ష్మి, పావని, బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు భద్రత కల్పించండి



రాజీవ్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న పాఠశాలల ఉపాధ్యాయులు

**ఆమనగల్లు, ఆగస్టు21, ప్రభాతవార్త:** నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో విద్యార్థుల చేతిలో హత్యకు గురైన కరస్పాండెంట్ రూపారెడ్డి ఘటనకు నిరసనగా ఉపాధ్యాయులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ట్రస్మ ఆమనగల్లు డివిజన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. డివిజన్ పరిధిలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, యాజమాన్యం పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. ట్రస్మ ఆమనగల్లు డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అబ్బిమల్ల శ్రీరామ్ అధ్యక్షతన జరిగిన ర్యాలీలో ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల, మాడుగుల, వెల్దండ మండలాల ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయ బృందాలు వందలాదిగా తరలివచ్చారు. హనుమాన్ దేవాలయం నుండి ప్రారంభమైన ర్యాలీని జాతీయ రహదారి గుండా కొనసాగిస్తూ తహసీల్దార్ కార్యాలయం వద్ద ముగించారు. రూపారెడ్డి హత్యకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధ్యాయుల భద్రత కోసం ప్రత్యేక రక్షణ చట్టాన్ని వెంటనే ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. విద్యారంగంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరి జీవిత భద్రతపై ప్రభుత్వం తగిన భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాల యాజమాన్యాలు, ఉపాధ్యాయులపై బెదిరింపులు, భౌతిక దాడులు, వేధింపులు జరగకుండా ప్రత్యేక జిల్లా పోలీస్ నోడల్ అధికారి వ్యవస్థను నియమించాలని కోరారు. అనంతరం స్థానిక తహసిల్దార్ కార్యాలయం లో అధికారికి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు రూపారెడ్డి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు.

కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా ట్రస్మ ప్రతినిధులు అల్లాజిగౌడ్, అవ్వారి శివలింగం, అవ్వారి నిరంజన్, గోలి శ్రీనివాసులు, కోట్ల వెంకటేష్, చంటి, చెన్నయ్యగౌడ్, కమటం శేఖర్, జి. శ్రీనివాస్ గౌడ్, లక్ష్మణస్వామి, ఆంజనేయులు, జంగయ్యగౌడ్, రామస్వామిగౌడ్, తిరుమలేష్, శ్రీశైలం, ఉపాధ్యాయులు రమేష్, విట్టల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎక్కడ చూసినా అమ్మ నామ స్మరణే..



హైదరాబాద్‌లో వరలక్ష్మిని కొలుస్తున్న మహిళలు

షాద్ నగర్ సరస్వతి శివమందిరంలో పాల్గొన్న మహిళలు

## సన్న బియ్యానికి సున్నం

(మొదటి పేజీ తరువాయి)

మరోవైపు రవాణా చార్జీలు ఎక్కువవుతోందని భావించిన అక్రమార్కులు.. రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి శివారు జిల్లాల్లోని మిల్లుల్లో వాటిని పాలిష్ చేసి ప్రముఖ కంపెనీల పేరిట నంబర్‌వన్ ముద్రతో ప్యాక్ చేసి వినియోగదారు లకు అంటగడుతున్నా అధికారులెవరూ పట్టించు కోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నగరంలోని వనస్థలిపురంకు చెందిన ప్రైవేట్ ఉద్యోగి రాజేష్ రైతుబజార్ సమీపంలోని ఓబియ్యం దుకాణంలో రూ.1550 వెచ్చించి కర్నూలు నెంబర్1 బియ్యం బస్తాను కొనుగోలు చేశాడు. అధిక రేటు వెచ్చించి కొన్న బియ్యాన్ని ఇంటికి వెళ్లి వండితే మెతుకులన్నీ బొద్దుగా కనిపించడం, నోటికి రుచి అందకపోవడంతో నాసిరకం బియ్యాన్ని తనకు అంటగట్టాడని గ్రహించాడు. మరుసటి రోజు ఉదయం వ్యాపారి దగ్గరికి బియ్యాన్ని తీసుకెళ్లి వాపస్ తీసుకోమని చెప్పగా నిరాకరించాడు. చేసేదేమీలేక వచ్చినదారినే వెనుదిరిగాడు. కాగా ఉద్యోగి రెండు విధాలుగా నష్టపోయాడు..రేటు విషయం ఒకటైతే..నకిలీ విషయంలో మరో విధంగా నష్టపోయాడు. ఇది ఈఒక్కఉద్యోగికి సంబంధించిన విషయం కాదు. నిత్యం నగర వ్యాప్తంగా వ్యాపారుల చేతుల్లో నష్ట పోతున్న వేలాదిమంది ప్రజల విషయం. నెంబర్ వన్ క్వాలిటీ బియ్యం పేరుతో వ్యాపారులు ప్రజలను మోసపుచ్చుతున్నారు. వేలాది రూపాయలు వెచ్చించి కొన్న ఫలితం లేకుండా పోతుండటంతో విక్రయదారులు నష్టపోతున్నారు. నంబర్‌వన్ క్వాలిటీ పేరుతో నకిలీ బియ్యాన్ని ప్రజలకు అంటగడుతూ వ్యాపారులూ, డీలర్లు, ఏజెంట్లు లక్షలు సొమ్ముచేసుకుంటున్నారు. రాష్ట్రంలో అత్యంత నాణ్యతతో బియ్యాన్ని తయారు చేసే కంపెనీలు పలు బ్రాండెడ్ ముద్రలు వేసి మార్కెట్‌లో విక్రయిస్తున్న విషయం అందిరికీ తెలిసిందే. అయితే ఆకంపెనీల బ్రాండెడ్‌ను కొందరు వ్యాపారులు వాడుకొని ఆదే పోలికతో కూడిన బస్తాలను తయారు చేయించి అందులో నాసిరకం బియ్యం నింపి ప్రజలను మోసపుచ్చుతున్నారు.

**బ్రాండెడ్ బస్తాల్లో నాసిరకం మిక్సింగ్...**

నగరంలో నాణ్యమైన ఖాళీ బస్తాలను ఒక్కొక్కటి రూ.15 నుండి రూ.20 చొప్పున కొనుగోలు చేసి వాటిపై బ్రాండెడ్ కంపెనీల పేర్లు ముద్రిస్తు న్నారు. ఇలాంటి బస్తాల్లో నాసిరకం బియ్యం నింపి 25కిలోల బస్తా రూ.1300 నుండి రూ.1700, 50కిలోల బస్తాను రూ.2700 నుండి రూ.3500 వరకు విక్రయిస్తునా న్రరు. బస్తాలపై బ్రాండెడ్ కంపెనీల పేర్లు ముద్రించి ఉండటం వల్ల బియ్యాన్ని పరిశీలించకుండానే వినియోగదారులు కొనుగోలు చేసి దారుణంగా మోసపోతున్నారు. హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఏకంగా రైస్‌మిల్లుల్లోనే ఈతరహాబస్తాల మార్పిడి జరుగుతున్నట్లు సమాచారం. మార్కెట్ లో దొరికే సాధారణ బియ్యాన్నే దట్టంగా పాలిష్ చేసి నెంబర్‌వన్ అనే ముద్రవున్న బస్తాల్లో నింపి విక్రయిస్తున్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న బిఆర్ఎస్‌వి నాయకులు

## పాలిటెక్నిక్ విద్యను దూరం చేయకండి

**షాద్‌నగర్, ఆగస్టు 21, ప్రభాతవార్త :** పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో.97ను తక్షణమే రద్దు చేయాలని బీఆర్ఎస్వీ షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షులు శీలం శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సూచన మేరకు షాద్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శీలం శ్రీకాంత్ మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్య పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వేలాది మంది విద్యార్థులకు సాంకేతిక విద్యను అందిస్తోందన్నారు. డిప్లొమా అనంతరం ఉద్యోగ అవకాశాలతో పాటు ఈసెట్ ద్వారా బీటెక్‌లో రెండో సంవత్సరంలో లేటరల్ ఎంట్రీకి అవకాశం ఉందని తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడం వల్ల డిప్లొమా గుర్తింపు, ఈసెట్ లేటరల్ ఎంట్రీ, ప్రభుత్వ ఉద్యోగాల అర్హత, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, పరీక్షా విధానం, సీట్లు, అధ్యాపకులు, మౌలిక వసతుల విషయంలో విద్యార్థుల్లో అనిశ్చితి నెలకొనే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే కీలక నిర్ణయాలపై విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, సాంకేతిక విద్యా నిపుణులతో విస్తృతంగా చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని కోరారు. జీవో.97ను వెంటనే రద్దు చేసి పాలిటెక్నిక్ కళాశాలలను ప్రస్తుత సాంకేతిక విద్యా వ్యవస్థలోనే యథావిధిగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సోని శేఖర్, ఉప సర్పంచ్ ధీమ గణేష్, బీఆర్ఎస్వీ నాయకులు తుప్పుడు నరసింహా, వడ్డె మహేష్, సంజు నాయక్, ప్రవీణ్, సత్యం, సతీష్, సాయితేజ, తేజ, శివ నాయక్, నవీన్, ఉదయ్, నగేష్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న స్థానిక నేతలు

## అండర్ డ్రైనేజీ, సిసి రోడ్డు పనులకు శ్రీకారం

**షాద్‌నగర్, ఆగస్టు 21, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ 21వార్డు లో పటేల్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు, అండర్ డ్రైనేజీ పనులను షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ మాట్లాడుతూ పట్టణాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని, వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను నివారించేందుకు పరిష్కరిస్తామన్నారు. పనుల్లో పూర్తి నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ జి టి వసంత శ్రీనివాస్, కౌన్సిలర్ మురళి మోహన్ (అప్పి), పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, పులిమామిడి శ్రీశైలం గౌడ్, మంగ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



విచారణ చేస్తున్న డిఎస్‌పి

## చెల్లాపూర్‌లో ఉద్రిక్తతకు దారితీసిన భూవివాదం

**కుల్కచర్ల, ఆగస్టు 21, ప్రభాతవార్త :** మండల పరిధిలోని చెల్లాపూర్ గ్రామంలో భూ వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. ఈ ఘటనపై పోలీసులు ఎస్సి,ఎస్టి అట్రాసిటి చట్టం కింద కేసు నమోదైయింది. చెల్లాపూర్ గ్రామానికి చెందిన పెంటయ్య హిర్యానాయక్ తాండకు చెందిన అమ్రార్య నాయక్ భూ వివాదం ఇరువంర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అమ్ర్యానాయక్ పంటయ్యపై కేసు నామోదు కావడంతో డిఎస్‌పి శ్రీనివాస్, సిఐ కొండల్ రెడ్డి,ఎస్ఐ రమేష్ కుమార్ గ్రామానికి చేరుకోని బాధితులు, సంబంధిత వ్యక్తులతో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించారు.

కేసుకు సంబంధించిన ప్రతి అంశాన్ని క్షుణంగా పరిశీలించి, విచారణ అధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. చట్టాన్ని ఎవ్వరు తమ చేతుల్లోకి తీసుకోవద్దని, గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ వేగవంతం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

నిలిపే విధంగా ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల్లో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ సామర్థ్యాలను పెంపొందించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలనిఅన్నారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం ప్రాథమిక గణిత నైపుణ్యాలను సాధించేలా పాఠశాల స్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ప్రతి మండల విద్యాధికారి ప్రతి నెల తప్పనిసరిగా కనీసం 15 పాఠశాలలను సందర్శించి, పాఠశాలల్లో విద్యా బోధన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, ప్రగతి ఇతర అకాడమిక్ అంశాలను సమగ్రంగా పరిశీలించాలని అన్నారు. పాఠశాలలను సందర్శించిన సందర్భంగా అకాడమిక్ రిజిస్టర్‌లో నమోదు చేసిన సూచనలు, సమస్యలు, నిర్దేశించిన చర్యలు తదుపరి సందర్శన సమయంలో అమలు అయ్యాయా లేదా అనే అంశాన్ని తప్పనిసరిగా సమీక్షించాలని సూచించారు. గత సందర్శనలో సూచించిన అంశాలపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తీసుకున్న చర్యలను పరిశీలించి, పెండింగ్ అంశాలను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన మార్గదర్శకాలు ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలపై ప్రతిరోజూ ప్రగతిని సమీక్షిస్తూ, పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు పరిష్కరించి, జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిగా సాధించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని, పలు మండలాల ఎంఈఓ లు పాల్గొన్నారు.

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

ఎవరులేని సమయంలో ఫ్యాన్ కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బయటకు వెళ్లి వచ్చిన భార్య ,భర్త ఫ్యాన్ కు వేలాడుతుండగా వెంటనే దగ్గరలోని ఆసు పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలి పారు. కుటుంభ సభ్యుల పిర్యాద మేరకు వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆర్థిక లావాదేవీలు విషయంలో తీవ్ర మానసిక ఒత్తిడికిలోనై ఆత్మహత్య చెదుకున్నట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తెలినట్లు తెలిపారు.

## ఎస్ఆర్ నగర్‌లో కర్నాటక డిఫెన్స్ మద్యం పట్టివేత

**-నిందితుడి నుంచి రూ 1.50 లక్షల విలువైన 55 బాటిళ్లు స్వాధీనం**

**హైదరాబాద్, ఆగస్టు 21,ప్రభాతవార్త:** ఎస్ఆర్‌నగర్ ఉమేష్ చంద్ర విగ్రహం వద్ద అనుమానాస్పదంగా మద్యం బాటిల్లతో ఉన్న వ్యక్తిని అమీర్పేట్ సీఐ బానోత్ పటేల్ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. అతని వద్ద ఉన్న నాలుగు మద్యం బాటిళ్ల కర్ణాటక చెందిన ప్రీమియం లిక్కర్ గా గుర్తించారు. ఈ విషయంపై ఆరా తీయగా కే.గోవర్ధన్ రెడ్డి(46) వద్ద నుంచి అవి తీసుకున్నట్లు గుర్తించారు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు గోవర్ధన్ రెడ్డి ఇంట్లో సోదాలు చేయగా 51 మద్యం బాటిల్లు వివిధ రకాలైన కర్ణాటక డిఫెన్స్ మద్యం బాటిళ్ల పట్టుబడ్డాయి.

# నల్గొండ ఘటనకు నిరసనగా మేడ్చల్‌లో శాంతి ర్యాలీ

**హత్యకు గురైన నాగార్జున్ హైస్కూల్ ప్రిన్సిపాల్ రూపారెడ్డికి నివాళి**

మేడ్చల్, ఆగస్టు 21. ప్రభాతవార్త ః నల్గొండ జిల్లాలోని నాగార్జున హైస్కూల్ ప్రిన్సిపాల్ రూపారెడ్డి దారుణహత్యను తీవ్రంగా నిరసిస్తూ, మేడ్చల్ మండల ప్రైవేట్ పాఠశాలల యాజమా న్యాల సంఘంఆధ్వర్యంలో శుక్రవారం మేడ్చల్ పట్టణంలో శాంతి ర్యాలీ , పాఠశాలల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి, హతురాలైన రూపారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులర్పించారు.

ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ పిల్లలకు మొబైల్ ఫోన్లు ఇచ్చేటప్పుడు తల్లిదండ్రులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, ఫోన్ ఇచ్చి వదిలేయకుండా, వారు ఏం చూస్తున్నారో దగ్గరుండి గమనించి, ఫోన్ దుర్వినియోగం కాకుండా చూసుకోవడం తల్లిదండ్రుల బాధ్యత అని అన్నారు. పిల్లలపై అతిప్రేమ చూపించి వారిని నెత్తినెక్కించుకోకూడదు. వారిలో పెరుగుతున్న మానసిక ఒత్తిడిని తగ్గించడానికి పిల్లలతో తల్లిదండ్రులు మనసు విప్పి మాట్లా డాలని, వారి సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించే విధంగా పాటుపడాలని కోరారు. నవసమాజాన్ని నిర్మించే ఉపాధ్యాయులు నేడు తీవ్ర అభద్రతాభావంలోకి వెళ్ళిపోయే పరిస్థితులు వచ్చాయని, విద్యార్థులకు మార్కులు రావాలన్నా, క్రమశిక్షణ నేర్పాలన్నా, కనీసం మందలించాలన్నా కూడా టీచర్లు భయపడే పరిస్థితి రావడం శోచ నీయమన్నారు.


హత్యకు గురైన రూపారెడ్డికి మేడ్చల్ పట్టణంలో నివాళులర్పిస్తున్న మేడ్చల్ మండల ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం ప్రతినిధులు

పాఠశాలలో ఉన్నంత సేపు విద్యార్థులు మొబైల్ వాడకుండా బాధ్యతాయుతంగానే ఉంటున్నారని, కాని ఇంటికి వెళ్ళిన తర్వాత పర్యవేక్షణ లోపించడమే ప్రవర్తన లోపాలకు కారణమవుతోందని తెలిపారు. పిల్లల నడవడికపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని, వారి నడవడిలో ఏ మాత్రం అనుమానం వచ్చినా యాజమాన్యంతో చర్చించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం మేడ్చల్ జిల్లా కోశాధికారి గిరిబాబు, మండల ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, కాశాధికారి నారాయణ మూర్తి, ఉపాధ్యక్షుడు లవ కుమార్ గౌడ్, జాయింట్ సెక్రెటరీ సత్యనారాయణ సత్యనారాయణ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు మాథ్యూ జోసఫ్, శ్రీనివాస్ రెడ్డి, జి శ్రీనివాస్ రెడ్డి, రాకేష్మ, మండలంలోని వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పూడూరులో జల సంరక్షణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

**భవనాలపై పడే ప్రతివర్షపు నీటిబిందువు**

## భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలి

**పూడూరు, ఆగస్టు 21, ప్రభాతవార్త :** భవనాలపై పడే ప్రతివర్షపు నీటిబిందువును రూఫ్‌టాప్ హార్వెస్టింగ్ నిర్మాణాల ద్వారా భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని కేంద్ర భూగర్భ జలబోర్డు సీనియర్ సైంటిస్టు, జల్‌సంచయ్–జన్‌భాగీదారి చీఫ్ నోడల్ అధికారి డాక్టర్.ఎస్ఎస్ విఠలా సూచించారు.శుక్రవారం పూడూరు మండలం పరిధిలోని మన్నెగూడ,కండ్లపల్లి,కొత్తపల్లి,పూడూరు,తిర్మలాపూర్ గ్రామాలను సంద ర్శించి విబిజి రాంజి పథకం క్రింద చేపట్టిన రూఫ్‌టాప్ హార్వెస్టింగ్ నిర్మాణాలు,రైతుల పొలాల్లో ఎర్తింగ్ బండింగ్,ఫీడర్ చానల్ డిసిల్టింగ్,కొండలు,గుట్టల్లో నీటిని నిల్వచేసే కాంటూరు ట్రెంచ్,వ్యక్తిగత,కమ్యూనిటీ ఇంకుడు గుంతలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల సంరక్షణ పనులను చేయించిన అధికారులను అభినందించారు.ప్రతి గ్రామంలో హరితహారం కార్యక్రమాన్ని చేపట్టి గ్రీన్‌కవర్‌ను పెంచడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడం సంతోషమన్నారు.ఈ కార్య క్రమంలో వికారాబాద్ జిల్లా అదనపు డిఆర్డీఓ మల్ల సత్తయ్య,ఎంపిడిఓ పాండు, టెక్నికల్ కో–ఆర్డీనేటర్ సైదులు,ఏపీఓ అశోక్ కుమార్,జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి అజీంపటేల్,నాయకులు మేఘరాజు,టెక్నికల్ అసిస్టెంట్లు శ్రీనివాస్,శ్రీకాంత్, ఎల్లయ్య,పంచాయతీకార్యదర్శి రాజు,ఫీల్డుఅసిస్టెంట్లు యాదమ్మ,ఖరీంఖాన్, యాదయ్య, భాను ప్రకాష్,పలువురు మేటీలు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ భద్రత ఆన్‌లైన్ మోసాలపై అవగాహన

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులు సాంకేతికతను సురక్షితంగా బాధ్యతాయుతంగా వినియోగించుకోవడం నేర్చుకోవాలని డాక్టర్ జివిఎల్. ఆనంద్‌బాబు అన్నారు. పోచారం డివిజన్ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ డిపార్టుమెంటు ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఐఈఈఈ, ఎస్ఎస్ఐటీ స్టూడెంట్ బ్రాంచ్ చాప్టర్ సహకారంతో డిజి రక్ష ఇంటరాక్టివ్ సైబర్ సేఫ్టీసిమ్యులేషన్ కార్యక్రమాన్ని ఘట్‌కేసర్ జడ్పీ బాలుర పాఠశాలలో నిర్వహించారు. 9, 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. సైబర్ భద్రత, ఆన్‌లైన్ మోసాలు, ఫిషింగ్, బలమైన పాస్వర్డు వినియోగం, సోషల్ మీడియా భద్రత, వ్యకిగత సమాచార పరిరక్షణ, సురక్షితమైన ఇంటర్నెట్ వినియోగం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ సభ్యులు బి. విష్ణుతేజ, డి. మృదుల, ఎన్. సాత్విక, పి. సాయి సృజన, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ జి. శేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విబిజి రాంజీ పథకం పనులను పరిశీలించిన సెంట్రల్ సభ్యులు

**దోమ,ఆగస్టు21,ప్రభాతవార్త:** మండల పరిధిలోని బుద్లాపూర్, పోతిరెడ్డిపల్లి, అనంతరెడ్డిపల్లి,గ్రామాలలో శుక్రవారం నాడు విబిజి రాంజీ ఉపాదిహామి పథకం పనులను సెంట్రల్ టీంసభ్యులు అయిన నోడల్ అధికారి ఎస్ఎస్ మిట్టల్ పర్యవేక్షణలో గ్రామాల్లో జరిగిన పనులనుపరిశీలించారు.గ్రామాల్లో సోఫిట్,బోర్వెల్,రిస్ట్రక్చర్,చెరువుల్లో పూడికతీత పనులను పరిశీలించారు. కేంద్రప్రభుత్వం నిదులతో జరుగుతున్న విబిజి రాంజీ ఉపాదిహామి పథకం పనులను మరింత వేగవంతం చేయాలని ఆయా గ్రామాల ప్రజా ప్రతినిదులకు ,ఉపాది హామి సిబ్బందికి తెలియజేశారు.ప్రజలకు ఉపయోగ పనులకు ప్రాదాన్యతను ఇచ్చి కూలీలకు పనికల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమములో బుద్లాపూర్ సర్పంచ్ మోతేబాబు,డిఆర్‌డిఓ ఈసి సైదులు,ఎపిఓ నర్సిములు,ఈసి సురేంద్రబాబు,పంచాయతీ కార్యదర్శి రాములు,టిఏ నారాయణరెడ్డి,శ్రీనివాస్,ఫీల్డ్ అసిస్టెంట్లు, వెంకటయ్య,రమేశ్,పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న సెంట్రల్ టీం సభ్యులు

**రోడ్డు ప్రమాదంలో**

## ముగ్గురికి తీవ్ర గాయాలు

**కీసర,ఆగస్టు21,ప్రభాతవార్త:** రోడ్డు ప్రక్కన ఆగి ఉన్న డీసీఎంను ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది.సిఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం కీసర సర్కిల్ పరిధిలోని అంకిరెడ్డిపల్లి గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన పండుగ బన్ని (18),శ్రీనాథ్ (18),హరి (18)లు కీసర రా స్టుడియోలో పని చేస్తున్నారు.మధ్యాహ్నం రెండవ షిఫ్ట్ డ్యూటికి వెళ్లెందుకు ముగ్గురు కలిసి ఒకే వాహనంపై కీసరకు వస్తున్నారు.కీసరగుట్ట చౌరస్తా వద్ద ఉన్న సిమెంట్ బ్రిక్స్ కంపెనీ వద్ద రోడ్డు ప్రక్కన ఉన్న డీసీఎం వ్యానును అదుపుతప్పి వెనకాలనుంచి ఢీ కొట్టారు.దీంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న బన్ని తలకు తీవ్ర గాయాలయ్యాయి.వెనకాల కూర్చున్న హరి,శ్రీనాథ్ కాళ్ల చేతులకు గాయాలయ్యాయి.గాయపడిన ముగ్గురిని 108 వాహనంలో కీసరలోని భాను హస్పిటల్‌కి తరలించారు. తీవ్రంగా గాయపడిన బన్నిని నగరంలోని యశోద ఆసుపత్రికి తరలించారు.ఈ కేసును కీసర పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు

## అసత్య ఆరోపణలు సరికాదు..

**సర్పంచ్ అరవింద్ నాయక్**

**యాచారం,ఆగస్టు 21, ప్రభాతవార్త:** యాచారం మండల పరిధిలోని మంతన్ గౌరెల్లి గ్రామంలో కొందరు కావాలనే తన పైన అసత్య తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని సర్పంచ్ కొర్ర అరవింద్ నాయక్ అవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామంలో సర్వేనెంబర్ 106లో ఎటువంటి భూమిని నేను కబ్జా చేయలేదని చెప్పారు. కొందరు కావాల్సి కొని తన పైన బురద చల్లే ప్రయత్నం ఉన్నారని అన్నారు. మంత్రాల ఎల్లమ్మ ఆలయం దగ్గర అమ్మవారి దర్శనంకోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి పనులు చేయడం జరిగిందని పేర్కొన్నారు. వారే రియల్ ఎస్టేట్ పేరుతోనే ప్రభుత్వ భూమిలో రోడ్డు వేశారని గుర్తు చేశారు. స్మశాన వాటిక దగ్గర తాను కబ్జా చేసినట్టు ఆరోపిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా తన పైన తప్పుడు ఆరోపణలు మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు .


విలేకరులతో మాట్లాడుతున్న సర్పంచ్ అరవింద్ నాయక్

## రాంపల్లి హస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్స

**కీసర,ఆగస్టు21,ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని రాంపల్లిలో జేఎన్‌రెడ్డి లయన్స్ క్లబ్ హస్పిటల్‌లో శుక్రవారం అరుదైన శస్త్ర చికిత్స జరిగింది.గత మూడు సంవత్సరాలుగా కడుపునొప్పితో బాధపడుతున్న ఒక యువతికి వెంటనే అల్ట్రా స్కానింగ్ చేసి గర్భాశయంలో కణతి పెద్దదిగా ఉందని గుర్తించి దాదాపు రెండుగంటలసేపు ఆపరేషన్ చేసి వెలికి తీయడం జరిగింది.పేషెంటు కుటుంబ సభ్యులకు చూపించి బయోస్పికి పంపించడం జరిగింది. దప్రస్తుతం పేషెంటు ఐసియులో చికిత్స పొందుతున్నదని డాక్టర్లు తెలిపారు.ఇన్ని రోజులు ఆలస్యం చేయడం అంత మంచిది కాదని సీనియర్ సర్జన్ రమేష్,డాక్టర్ వినయ్‌కుమార్ పేర్కొన్నారు.


రాంపల్లి జేఎన్ రెడ్డి హస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్స చేస్తున్న డాక్టర్లు

**ధారూర్ తహసీల్దార్ కార్యాలయంపై**

## అసత్య ప్రచారాలపై తీవ్ర ఖండన

**ధారూర్, ఆగస్టు 21, ప్రభాత వార్త:** ధారూర్ మండల కేంద్రంలో కొన్ని భూముల వివాదాలకు సంబంధించి తహసీల్దార్ సాజిదా బేగం, రెవెన్యూ సిబ్బందిపై జరుగుతున్న అసత్య ప్రచారం, బెదిరింపులను తహసీల్దార్ తీవ్రంగా ఖండించారు. చట్టప్రకారం బాధ్యతలతో విధులు నిర్వర్తిస్తున్న తమపై కొన్ని శక్తులు నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని శుక్రవారం ప్రకటనలో స్పష్టం చేశారు. రికార్డులు, న్యాయస్థానాల ఆదేశాల మేరకే తాము నడుచుకుంటున్నామని ఆమె తెలిపారు.వివాదాస్పద భూముల వాస్తవ పరిస్థితి ని వివరిస్తూ.. సర్వే నెంబర్ 115/ఈ/2 లో న్యాయస్థానపు నిషేధాజ్ఞలు ఉన్నప్పటికీ, అలాగే సర్వే నెంబర్ 134 పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. సర్వే నెంబర్ 111/ఈ/1/ఏ మరియు సర్వే నెంబర్ 3లలో అక్రమ రిజిస్ట్రేషన్లు, దస్తావేజుల బదలాయింపులపై న్యాయ స్థానాలు, పోలీసు అధికారులకు ఫిర్యాదులు అందాయని వెల్లడించారు. నిబంధనలను పాటించని ఇలాంటి అక్రమాలను చట్టబద్ధంగా అడ్డుకున్నం దుకు, అర్హత లేని వారికి రేషన్ కార్డులు మంజూరు చేయనందుకు కొందరు తమపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆమె హెచ్చరించారు.


వివరాలు తెలుపుతున్న తహసిల్దార్ సాజిదా బేగం

## నందివనపర్తిలో పందుల స్వైరవిహారం

**పందుల బెడదతో గ్రామస్తులు పరేషాన్**

**యాచారం, ఆగస్టు 21, ప్రభాతవార్త:** యాచారం మండల పరిధిలోని నందివనపర్తిగ్రామంలో పందుల స్వైరవిహారం తీవ్రరూపం దాల్చింది. నిత్యం వందలాది పందులు జనావాసాల మధ్య, ప్రధాన వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతుండటంతో స్థానిక ప్రజలు చిన్నారులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువలు ,చెత్తాచెదారం ఉన్న ప్రాంతాల్లోనే కాకుండా ఏకంగా ఇళ్ల ముంగిట్లోకి వస్తుండటంతో పారిశుధ్యం పూర్తిగా క్షీ ణించింది. పందుల విసర్జితాల వల్ల గ్రామంలో దుర్వాసన వెదజల్లుతోంది.దీనివల్ల డెంగ్యూ, మలేరియా, మెదడువాపు వంటి ప్రమాదకరమైన అంటువ్యాధులు ప్రబలే అవకాశంఉందని స్థానికులు భయాందోళనలకు గురవుతు న్నారు. చిన్న పిల్లలు వీధుల్లోకి రావాలంటేనే భయపడిపోతున్నారు. గ్రామంలోని ప్రధాన కాలనీలతో పాటు ఎస్సీ వాడ, బీసీ కాలనీల్లో ఈ సమస్య మరీ తీవ్రంగా ఉందని నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో పందుల గుంపులు రోడ్లపైకి వస్తుండ టంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ సమస్యపై స్థానిక గ్రామ పంచాయతీ అధికారులకు, కార్యదర్శులకు పలుమార్లు విన్నవించినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని, వారి నిరక్ష ్యం వల్లే సమస్య రోజురోజుకూ జటిలమవుతోందని గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం పన్నులు వసూలు చేయడంలో చూపే శ్రద్ధ, గ్రామంలోని కనీస సమస్యలను పరిష్కరించ డంలో అధికారులు చూపడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, పందుల యజమానులకు నోటీసులు జారీ చేయాలని, వాటిని ఊరి వెలుపలికి తరలించి గ్రామంలో తక్షణమే బ్లీచింగ్ పౌడర్ చల్లించి పారిశుధ్య పనులు చేపట్టాలని గ్రామస్థులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.


నంది వనపర్తిలో నివాసాలలో చేరిన పందుల గుంపు


ఆలయ శిఖర గోపుర నిర్మాణంలో పాల్గొన్న సర్పంచ్ తదితరులు

## అప్పాయిపల్లిలో సరస్వతిమాత ఆలయ నిర్మాణం

**కొడంగల్,ఆగస్టు 21,ప్రభాతవార్త:**

మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలో సరస్వతి ఆలయ నిర్మాణం అత్యంత వైభవపేతంగా నిర్మిస్తున్నారు.ఆలయ నిర్మాణంలో భాగంగా శుక్రవారం ఆలయ శిఖరం గోపుర నిర్మాణ పూజల్లో గ్రామసర్పంచ్ బొడ్రాయి వెంకటయ్య,ఉపసర్పంచ్ పకీరప్ప, గ్రామస్థులు మోతిసింగ్,గోకుల్‌సింగ్,కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అద్యక్షులు సంగప్ప తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వ హించారు.ఈ సందర్భంగా గ్రామస్థులు దత్తుసింగ్, కిషన్‌సింగ్, కరణ్‌సింగ్,దామోదర్,పంతులు రాజస్వామి,మల్లప్ప,హనుమప్ప, కాశప్ప తదితరుల అద్వర్యంలో ఆలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

### అంగడిరైచూర్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులుగా బుగ్గప్ప

**కొడంగల్,ఆగస్టు 21,ప్రభాతవార్త:**

కొడంగల్ మండలంలోని అంగడిరైచూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అద్యక్షులుగా గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు డి.బుగ్గప్ప ఎన్నికైయ్యారు.శుక్రవారం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్‌రెడ్డి,మున్సిపల్ చైర్మెన్ నందారం ప్రశాంత్ ఆధ్వర్యంలో గ్రామ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలన్నారు.అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరేలా నాయకులు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బాల్‌రెడ్డి,మండల వర్కింగ్ ప్రసిడెంట్ ఆనంద్‌రెడ్డి,సర్పంచ్‌లు లక్ష్మణ్‌గౌడ్,నాయకులు కురమ్మరి నాగప్ప,గోడల రాంరెడ్డి,బోయని రాములు,అంజిలప్ప,వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.


నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

## కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలం


మాట్లాడుతున్న పి.మహిపాల్‌రెడ్డి

**పెద్దేముల్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమని, పార్టీలో ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు పి.మహిపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆదేశాలతో డీసీసీ అధ్యక్షులు ధారాసింగ్ పిలుపు మేరకు మండలపార్టీ అధ్యక్షులు పి.మహిపాల్‌రెడ్డి అధ్వర్యంలో గత ఐదు రోజులుగా మండలంలోని వివిధ గ్రామాలలో కాంగ్రెస్‌పార్టీ గ్రామ కమిటీలను నియమించి శుక్రవారం ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని 38 గ్రామపంచాయతీలలో 35 గ్రామాలలో గ్రామ కమిటీలను నియమించామని, జనగాం, కందనెల్లితాండా, తట్టెపల్లి గ్రామాలలో తీవ్ర పోటి నెలకొన్నందున పెద్దల సమక్షంలో వాటిని కూడా త్వరలో నియమిస్తామని అన్నారు. అంతర్గత విభేదాలకు తావులేకుండా పార్టీ బలోపేతం కోసం అందరు కలిసికట్టుగా ముందుకు సాగాలని అన్నారు. గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేలా కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా గ్రామ కమిటిలను పకడ్బందిగా నిర్వహించామని, మనోహర్‌రెడ్డిని మరోసారి ఎమ్మెల్యేగా, రేవంత్‌రెడ్డి మళ్ళీ సిఎం అయ్యేలా, రాహుల్ గాంధి ప్రధాని అయ్యేలా కార్యకర్తలు, నాయకులు సమిష్టి కృషితో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు నారాయన్‌గౌడ్, కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఉపాద్యాక్షులు ఎల్లారెడ్డి, కార్యదర్శి నసీర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల కుమార్, మాజీ టీపీసీసీ మైనార్టీ కన్వీనర్ యండి.రియాజ్, మండల పార్టీ మాజీ అధ్యక్షులు కొండపురం గోపాల్, సొసైటి డైరెక్టర్ ఉప్పరి మల్లేశం, నాయకులు గాజీపూర్ లాల్‌రెడ్డి, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, తట్టెపల్లి నర్సిములు, జగన్, శంకర్, సాబేర్, ఆర్.శ్రావన్, హర్షవర్ధన్‌రెడ్డి, కుర్వ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరం


విజేతకు సర్టిఫికెట్‌ను అందిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మెన్

**కొడంగల్,ఆగస్టు 21,ప్రభాతవార్త:** బాలికలకు ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవడం ఎంతో అవసరమని మున్సిపల్ వైస్‌చైర్మెన్ శంకర్‌నాయక్,ఎస్సై జీవీ.సత్యనారాయణ అన్నారు.శుక్రవారం మండల పరిధిలోని రుద్రారం ,పెద్దనందిగామ,నీటూర్,చిట్లపల్లి గ్రామాల్లో కరాటే మాస్టర్ కుమ్మరి శ్రీనివాస్ అద్వర్యంలో విద్యార్దినిలకు కరాటే పోటీలు నిర్వహించారు.పోటీల్లో 35 మంది విద్యార్దులు పాల్గొనగా అందులో ప్రతిభ కనబర్చిన విద్యార్దినిలకు వివిధ రకాల బెల్టులు,సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్దినిలు విద్యతో పాటు ఆత్మ రక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రమేష్‌బాబు,పెద్దనందిగామ సర్పంచ్ చెన్‌బస్‌కుమార్,పాఠశాల హెచ్ఎం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ అధికారులకు ఘనసన్మానం

**కొడంగల్,ఆగస్టు 21,ప్రభాతవార్త:**

మండలంలో ఉత్తమ అధికారులుగా ఎంపికైన మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్,తహశీల్దార్ రాంబాబులను ఘనంగా సన్మానించారు.శుక్రవారం స్దానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ నందారం ప్రశాంత్,మున్సిపల్ వైస్ చైర్మెన్ శంకర్‌నాయక్,మున్సిపల్ కౌన్సిలర్ సుష్మదామోదర్,కోఆప్షన్ సభ్యులు మునీర్,రమేష్‌బాబు తదితరులు ఉత్తమ అధికారులుగా ఎంపికైన మున్సిపల్ కమీషనర్,తహశీల్దార్‌లను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.విధుల పట్ల అంకిత భావంతో పనిచేస్తు ప్రజలకు సేవలు అందించడంతో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అదికారులుగా ఎంపికైయ్యారు.


ఉత్తమ అధికారులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మెన్ తదితరులు

## వృద్ధులే సమాజానికి జ్ఞానదాతలు



సీనియర్ సిటిజన్స్ డే కార్యక్రమంలో పాల్గొన్న సాకేత్ ప్రణామం నివాసితులు

**సాకేత్ ప్రణామమ్‌లో ఘనంగా సీనియర్ సిటిజన్స్ డే**

**మేడ్చల్, ఆగస్టు 21, ప్రభాతవార్త :** సమాజానికి వృద్ధులే జ్ఞానదాతలని వారు సమాజానికి అందించిన సేవలు, త్యాగాలను స్మరించుకుంటూ గౌర వించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జన విజ్ఞాన వేదిక నాయకుడు, సాకేత్ ప్రణామమ్ డైరెక్టర్ వి.వి. వరప్రసాదరావు అన్నారు. ప్రపంచ సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా శుక్రవారం గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిర గౌడవెల్లిలోని సాకేత్ ప్రణామమ్ కాంప్లెక్స్ వెల్నెస్ హబ్ మినీ థియేటర్‌లో మొబిలిటీ ఇండియా సంస్థ భాగస్వామ్యంతో ప్రత్యేక ఆరోగ్య అవగాహన సదస్సు, సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృద్ధుల జీవిత అనుభవాలు, వారి జ్ఞానం సమాజ పురోగతికి మార్గదర్శకాలని, వారి పట్ల కృతజ్ఞత తెలుపుకోవడం అందరిపై ఉందని అన్నారు. సమాజానికి విశేష సేవలందించిన పెద్దలను స్ఫూర్తిగా తీసుకుని, వారిని గౌరవించుకోవడం ఆనందంగా ఉందన్నారు.అనంతరం మొబిలిటీ ఇండియా ప్రతినిధులు సామరాజు రెడ్డి, వర్షితలు వయోవృద్ధులు ఎదుర్కొనే శారీరక, ఆరోగ్య సమస్యలు, వాటిని క్రమబద్ధమైన వ్యాయామం ద్వారా ఎలా అధిగమించవచ్చో స్లయిడ్ షో ద్వారా వివరించారు. నిత్య వ్యాయామమే వృద్ధాప్య సమస్యలకు సరైన ఔషధమని వారు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో భాగంగా కమ్యూనిటీకి చెందిన వృద్ధులను నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో చైతన్య మహిళా సంఘం నాయకురాలు ఝాన్సీ శారదా దేవి, సొసైటీ చైర్మన్ డాక్టర్ కె. రామమోహనరావు, కార్యదర్శి వల్లభేంద్రరెడ్డి, డైరెక్టర్ నిరంజన్ రావు, కమ్యూనిటీ నివాసితులు వారణాసి సుభద్ర, కొమ్మాజోస్యుల బలభద్రరావు, బలిజేపల్లి సుందరీదేవి, భట్టు సుశీల, రాధాకృష్ణ, సుబేదార్ టి.ఎల్.ఎన్. శర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉదన్‌రావుపల్లిలో ధ్వజస్థంభం,బొడ్రాయి ప్రతిస్టాపన

**దోమ, ఆగస్టు 21, ప్రభాతవార్త :** మండల పరిదిలోని దోమ గ్రామ పంచాయతీ అనుభంద గ్రామము ఉదన్‌రావుపల్లి గ్రామములో ద్వజస్థంభం, బొడ్రాయి ప్రతిస్టాపన కార్యక్రమాలు ఘనంగా జరుగు తున్నాయి.శుక్రవారంనాడు గణపతిపూజ, పున్యావచనం, పంచాంగ శ్రవణం ,కలశస్థాపన అఖండదీపారాధన, అగ్నిప్రతిష్ట, హోమాలు విగ్రహ జలాదివాసం నిర్వహించారు.శనివారం,ఆదివారంనాడు మూడు రోజులుగా జరిగే కార్యక్రమములోగ్రామస్తులు బంధువులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని ఘనంగా జరుపుతున్నారు.మూడు రోజులుగా అన్నదాన ప్రసాదం దోమ గ్రామానికి చెందిన మాజి సర్పంచ్ రాజిరెడ్డి,విగ్రహ దాతలు దోమ గ్రామానికి చెందిన మాజి సర్పంచ్ రాంచంద్రారెడ్డి సోదరులు ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమములో దోమసర్పంచ్‌శివకుమార్‌రెడ్డి,దోమ మాజి జడ్‌పిటిసి లక్ష్మయ్య,ఉపసర్పంచ్ కవిత,ఖాజపాష, గొల్లశ్రీనివాస్, జాకటివెంకటయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు ఉండేలా చూడాలి

**చేవెళ్ల, ఆగస్టు 21, ప్రభాతవార్త :** ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఏ ఒక్కరూ ఓటు హక్కు కోల్పోకుండా బీఎల్‌వోలు జాగ్రత్తగా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఎస్ఐఆర్ జోనల్-3 ఇన్‌చార్జ్, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం సూచించారు. చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలో సి హెచ్ ఆర్ గార్డెన్ లో చేవెళ్ల అసెంబ్లీ బి ఎల్ ఏ 1 జిల్లా కార్యదర్శి గౌండ్ల కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో చేవెళ్ల అసెంబ్లీ విస్తృతస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకుడు మర్రి శశిధర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం పాల్గొన్నారు. ఎస్ ఐ ఆర్ రెండో దశలో పార్టీ శ్రేణులు, బీఎల్‌వోలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఓటరుకు సంబంధించిన ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయడంతోపాటు క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. ఓటర్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షి ంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్ రెండో దశలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, అనుసరించాల్సిన విధానాలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కె.ఎస్. రత్నం పాల్గొని పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేశారు. ప్రతి బూత్ పరిధిలో సమన్వయంతో పనిచేస్తూ సర్ ప్రక్రియను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీశైలం యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్, మహిళా మోర్చా అధ్యక్షురాలు మమత, సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షులు అనంత్‌రెడ్డి, మానయ్య, శ్రీకాంత్, భయానంద్, దయాకర్‌రెడ్డి, చంద్రకాంత్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు, బీఎల్ ఏ-2లు పాల్గొన్నారు.

## సామాజిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి




కరపత్రం విడుదల చేస్తున్న కెవిపిఎస్ నాయకులు

**పెద్దేముల్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** ఈ నెల ఆగస్టు 30, 31 తేదిలలో వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించే కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా స్థాయి సామాజిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కేవిపిఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి ఉప్పలి మల్కయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని అంబెద్కర్ విగ్రహం ముందు కేవిపిఎస్ అధ్వర్యంలో సామాజిక శిక్షణ తరగతుల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్బంగా ఉప్పలి మల్కయ్య మాట్లాడుతూ సామాజిక కార్యకర్తలకు తర్పీదు ఇవ్వడానికి ఈ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తార్యసింగ్, ప్రకాష్, వెంకటేష్, నర్సిములు, బాలమ్మ, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ కమిటీలే కాంగ్రెస్ పార్టీకి పునాది



నియామక పత్రాన్ని అందజేస్తున్న పి.మహిపాల్‌రెడ్డి

**పెద్దేముల్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** గ్రామ స్థాయిలో నిర్వహించే గ్రామ కమిటిలే కాంగ్రెస్‌పార్టీకి గట్టి పునాది అని మండల పార్టీ అధ్యక్షులు పి.మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండలంలోని గాజీపూర్, ఖానాపూర్, రుద్రారం, గోపాల్‌పూర్, తింసాన్‌పల్లి గ్రామాలలో గ్రామకమిటీలను నియమించారు. ఈ సందర్భంగా పి.మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతో గ్రామ కమిటీలను పకడ్బందిగా నియమిస్తున్నామని అన్నారు. రాబోయే ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా కష్టపడి పనిచేసే కార్యకర్తలకే గ్రామ కమిటి అధ్యక్ష, కార్యదర్శులుగా నియమించామని అన్నారు. గాజీపూర్ గ్రామ కమిటి అధ్యక్షులుగా జనుముల క్రిష్ణ,బూత్ కమిటి సభ్యులుగా జి.ఎల్లప్ప, నాగభూషణం, మాజీ యంపిటిసి హసీంఅలీలను నియమించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు నారాయన్‌గౌడ్, మాజీ డిఎల్‌డిప చైర్మెన్ పి.నారాయన్‌రెడ్డి, యండి, రియాజ్, జిల్లా నాయకులు ఎల్లారెడ్డి, నసీర్, సర్పంచ్ హేమలత లాల్‌రెడ్డి, మండల పార్టీ మాజీ అధ్యక్షులు కొండపురం గోపాల్, సోసైటి డైరెక్టర్ ఉప్పరి మల్లేశం, నాయకులు లాల్‌రెడ్డి, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, జి,శేఖర్, బిచ్చన్న, ఆర్,శ్రావన్, హర్షవర్ధన్‌రెడ్డి ,జీవప్ప తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసంక్షేమమే బిజేపి ప్రధాన ధ్యేయం

**పెద్దేముల్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** ప్రజాసంక్షేమమే బిజేపి పార్టీ ప్రధాన ధ్యేయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు యు.రమేష్ కుమార్ అన్నారు. చెవెళ్ళ యంపికొండా విశ్వేశ్వర్‌రెడ్డి నిధులతో శుక్రవారం పెద్దేముల్ మండలం మంబాపూర్‌లోని 3వ, 8వ వార్డులలో రెండు బోర్ వెల్స్‌ను యు.రమేష్ ప్రారంభించారు. ఈ సందర్బంగా యు.రమేష్ కుమార్ మాట్లాడుతూ మంబాపూర్‌లో తాగునీటి సమస్యను గుర్తించి ఎంపి నిధుల నుంచి బోరువెల్స్ వేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ గొబ్బురు రమేష్, సీనియర్ నాయకులు సందీప్‌కుమార్, క్రిష్ణ ముదిరాజ్, బంటారం భద్రేశ్వర్, మాజీ యంపిటిసి శ్రీనివాస్, నాయకులు రాము, శివకుమార్, బందెప్ప, బాలప్ప, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



బోరువెల్‌ను ప్రారంభిస్తున్న యు.రమేష్

వాల్య నాయక్ తండాలో

## గ్రామ పంచాయతీ భవనానికి భూమిపూజ

**దుద్యాల్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** మండలంలోని వాల్య నాయక్ తండా గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ దేవి బాయి, ఉప సర్పంచ్ ఎన్. దశరథ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అవుటి శేఖర్, మండల ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, వాల్య నాయక్ తండా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాథోడ్ వెంకట్ నాయక్, దుద్యాల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీశైలం పాల్గొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్, ఎంపీడీఓ జైపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణతో పాటు కాంగ్రెస్ నాయకులు పాండు నాయక్, సత్యం, రూప్లా నాయక్, వెంకట్ నాయక్, కిషన్ నాయక్, హన్మంతు, శంకర్ నాయక్, పసుల చెన్నయ్య, అమర్‌సింగ్, పాండు, మోహన్ నాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. నూతన పంచాయతీ భవనం నిర్మాణంతో గ్రామ ప్రజలకు పరిపాలనా సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని నాయకులు తెలిపారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు, కృషి చేస్తామని పేర్కొన్నారు.



గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న అధికారులు, నాయకులు

# కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో గుర్తింపు

**శామీర్‌పేట, ఆగస్టు 21, ప్రభావార్త:**

జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయటానికి అనుబంధ కమిటీల ఏర్పాటు కీలకమని, ఉత్సాహంగా ఉన్న వారికి, పార్టీ కోసం పనిచేసే వారికి అవకాశం ఉంటుందని మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం శామీర్‌పేట మండలంలోని అంతాయిపల్లిలోని ఎస్ఎన్ఆర్‌లో జిల్లా ఓబిసి సెల్ నూతన కమిటీ ఏర్పాటు కోసం డిసిసి అధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. దీనిలో ఓబిసి సెల్ రాష్ట్ర కన్వీనర్ కేతూరి వెంకటేశ, ఓబిసి పరిశీలకులు డాక్టర్ నాగులూరి అరుణ్‌కుమార్‌గౌడ్, అలోక్‌నాథ్, శామీర్‌పేట రాజేశ్, భాస్కర్, ధరఖాస్తు ఫారాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని, అనుబంధ కమిటీలను వేయటం జరుగుతుందని, ఉత్సాహంగ ఉన్న నాయకులు, పార్టీ కోసం పనిచేసే వారు ముందుకు రావాలని సూచించారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందని వజ్రేశ్‌యాదవ్ స్పష్టం చేశారు. ధరఖాస్తులను పరిశీలించి జిల్లా ఓబిసి నూతన కమిటీ ఏర్పాటు చేయటం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బిపిటి రాజు, శామీర్‌పేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు నక్క సందీప్‌గౌడ్, డివిజన్ల అధ్యక్షులు కర్రె రాజేశ్, మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, చాపరాజు, దోసకాయల వెంకటేశ, తుంకి రమేశ్, సురేందర్‌ముదిరాజ్, తుంగతుర్తి రవి, మేడ్చల్ మాజీ జడ్పీటిసి సాయిపేట శ్రీనివాస్‌యాదవ్, మేడ్చల్ జిల్లా ఓబిసి సెల్ మాజీ అధ్యక్షులు గువ్వా రవిముదిరాజ్, ఎఎంసి డైరెక్టర్ శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.



అంతాయిపల్లిలోని ఎస్ఎన్ఆర్ గార్డెన్‌లో జిల్లా ఓబిసి సెల్ కమిటీ ఏర్పాటు కోసం జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్,పాల్గొన్న ఓబిసి రాష్ట్ర సెల్ కన్వీనర్ కేతూరి వెంకటేశ, పరిశీలకులు డాక్టర్ ఎన్.అరుణ్‌కుమార్‌గౌడ్, అలోక్‌నాథ్, రాజేశ్, భాస్కర్ తదితరుల దృశ్యం

# నేడు గురుకుల్‌లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

**-ఎంపీ, ఎమ్మెల్యే, నేతలు రాక..ఏర్పాట్లు పూర్తి**

**ఘట్‌కేసర్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లోని గురుకుల్ విద్యాసంస్థలో శనివారం పలు అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఘట్‌కేసర్‌లోని గురుకుల జూనియర్ కళాశాలలో గురుకుల్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు నిర్మించిన మరుగుదొడ్లు, తరగతి గది ప్రారంభోత్సవానికి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కోవ లక్ష్మణ్, మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్‌రెడ్డి, డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్‌లతో పాటు మాజీ ప్రజాప్రతినిధులు విచ్చేస్తున్నారని గురుకుల్ పరిరక్షణ సమితి సభ్యులు తెలిపారు. గురుకుల్ అభివృద్ధి, నిర్వహణపై చర్చించి అవసరమైన ప్రతిపాదనలు, నిధులు మంజూరుపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. దాతల సహకారంతో గురుకుల్ కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, గురుకుల్ పూర్వవిద్యార్థులు, అభిమానులు అధిక సంఖ్యలలో పాల్గొనాలని వారు కోరారు.



గురుకుల్‌లో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

## ముమ్మరంగా సాగుతున్న జలసిరి



ఇంకుడుగుంత ఏర్పాటుకు ముగ్గు వేస్తున్న అధికారులు

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 21,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఆయా గ్రామాలలో జలసిరి పనులు ముమ్మరంగ కొనసాగుతున్నాయి. శుక్రవారం మండలంలోని వీరన్నపేట, ఎక్మీదేవిపల్లి, ఎల్కగూడ, కాస్లాబాద్, పెద్ద ఎల్కిచర్ల, చౌదరిగూడ, రావిర్యాల, గుంజల్‌పహాడ్ తదితర గ్రామాలలో పనులను ప్రారంభించారు. జలసిరి కార్యక్రమం ద్వారా ముఖ్యంగా నీటినిల్వ పనులు చేపడు తున్నారు. గ్రామాలలో ఇంకుడుగుంతలు, ఫాంపాడ్‌లపై ప్రత్యేకదృష్టి పెట్టారు. నీటి నిల్వపనులు చేయడం వలన భూగర్భజలాలు పెరుగుతా యని ప్రభుత్వ లక్ష్యం. దీంతో మండలంలోని అన్ని గ్రామాలలో నీటినిల్వ పనులు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు వినోద్‌కుమార్, కొండల్, సర్పంచ్ బందయ్య, ఫీల్డ్ అసిస్టెంటు లింగంగౌడ్, లక్ష్మయ్య, నర్సింహులు, రవి, రాజు తదితరులు ఉన్నారు.



శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకొని పలు అమ్మవారి ఆలయాలలో మహిళలు విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఇళ్ళలో వరలక్ష్మి వ్రతాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించుకున్నారు. ఇరుగు పొరుగు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

## భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం

**సంజీవరెడ్డి నగర్, ఆగస్టు 21, ప్రభాతవార్త:**

అమీర్‌పేట బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మల్లన్న గౌడ్ ఆధ్వ ర్యంలో శ్రావణ శుక్ర వారం సందర్భం గా వరలక్ష్మీ వ్రత పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వ హించారు. ఈ సంద ర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని వరల క్ష్మీ దేవిని భక్తిశ్రద్ధలతో పూజించారు.మహిళలు సంప్రదాయ దుస్తుల్లో హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, సర్వ మంగళా లు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. శ్రావణ మాసంలో వరలక్ష్మీ వ్రతానికి ఉన్న విశిష్టతను పలువురు వివరించారు.పూజా కార్యక్రమం అనంతరం మహిళలకు తీర్థప్రసాదాలు, వ్రత సామగ్రిని అందజేశారు. ఈకార్య క్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి పారవశ్యంతో వరలక్ష్మీ వ్రతాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## లిఖితగౌడ్ ఆధ్వర్యంలో వరలక్ష్మీ పూజలు

**హైదరాబాద్,ఆగస్టు 21 ప్రభాతవార్త**

నల్లకుంట డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు గంగిశెట్టి లిఖిత అమర్‌నాథ్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం వరలక్ష్మి ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. నల్లకుంటలోని ఆమె నివాసం లో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఎన్.అమృత, బి.పద్మా, పద్మావతి డిపిరెడ్డిలతోపాటు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లిఖితగౌడ్ వరలక్ష్మీదేవికి పూజలు నిర్వహించి మహిళలకు పసుపు, కుంకుమలు అందజేశారు. అనం తరం లిఖితగౌడ్ మాట్లాడుతూ అందరికీ వరలక్ష్మి వ్రత శుభాకాంక్షలు తెలిపారు.ఈ పూజాధి కార్యక్రమంలో బిఆర్ఎస్ మహిళా నాయకులు కళ్యాణి, విజయ, స్వప్న,క్రిష్టోలైట్, రజియా బేగం, రజియా, అనిత, లావణ్య, వర్ష, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## వరలక్ష్మి అమ్మవారిని పూజిస్తే వరాలు

**కంటోన్మెంట్,ఆగస్టు 21 ప్రభాతవార్త:**

వరలక్ష్మి అమ్మవారిని పూజిస్తే,అష్టలక్ష్మిలను పూజిం చినట్లు అని,దాంతో వరాలు ప్రసాధిస్తాయని కంటో న్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తెలిపారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని న్యూ సిటీ కాలనీలోని తన నివాసంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యురాలు జంపన విద్యావతి, పలువురు మహిళలు పాల్గొన్నారు.

### ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో జీవించాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్,ఆగస్టు 21 ప్రభాతవార్త:** ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖంతోషాలతో ఉండాలని,రాష్ట్రం సుబిక్షంగా,సిరిసంపదలు, సౌభా గ్యాలు కలిగి ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు కంటోన్మెంట్ ఎమ్మె ల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు.శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని కొల్లాపూర్‌లో ప్రసిద్ధిగాంచిన మహాలక్ష్మి దేవాలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## భారత క్రీడా రంగం రూపురేఖలను మార్చే పథకం ఖేలో ఇండియా

**ప్రపంచ బాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పతక విజేత జ్వాలా గుత్తా**

**ముషీరాబాద్, ఆగస్ట్ 21, ప్రభాతవార్త:** భారత క్రీడా రంగం రూపురేఖలను మార్చే సామర్థ్యం ఖేలో ఇండియా పథకానికి ఉందని ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పతక విజేత జ్వాలా గుత్తా స్పష్టం చేశారు. శుక్రవారం కవాడిగూడలోని సీజీవో టవర్స్‌లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఖేలో ఇండియా పథకాన్ని పునరుద్ధరించటంపై ఆమె స్పందిస్తూ ఈ పథకం క్రీడా రంగంలో పెను మార్పు తీసుకొచ్చే గేమ్ చేంజర్‌గా నిలుస్తుందని అన్నారు. చాలా కాలం క్రితమే ఈ పథకం రావల్సిందని, క్రీడలపై ప్రభుత్వం ఎప్పుడూ శ్రద్ధ వహిస్తూనే ఉందని తెలిపారు. ఎస్ఏఐ డిప్యూటి డైరెక్టర్ హిమబిందు మాట్లాడుతూ ఖేలో ఇండియా పథకంలోని కీలక అంశాలను, తెలంగాణ వంటి రాష్ట్రంపై ఈ పథకం చూపించే ప్రభావాన్ని వివరించారు. తెలంగాణ క్రీడా నరపాధికార సంస్థ వైస్ ఛైర్‌పర్సన్ డాక్టర్ సోనిబాలాదేవి మాట్లాడుతూ తెలంగాణ వంటి రాష్ట్రానికి ఈ పథకం ఎంతో ప్రయోజనకరమని, క్రీడలను విద్యా విధానంతో అనుసంధానిస్తున్న క్రమంలో మరింత మెరుగైన ఫలితాలను ఆశించవచ్చునని తెలిపారు. బెంగుళూరుకు చెందిన భారత క్రీడా ప్రాధికార సంస్థ ప్రాంతీయ డైరెక్టర్ విష్ణు సుధాకరన్ మాట్లాడుతూ ఖేలో భారత్ పథకం భాగస్వాములందరితో జరిపిన విస్తృత చర్చల ఫలితమేనని, క్రీడా ఉద్యమాన్ని, ప్రధాన మంత్రి మోదీ ఆకాంక్షిస్తున్న ఖేలో భారత్ నీతిని ప్రోత్సహించే విధంగా బడ్జెట్ కేటాయించారని తెలిపారు.




సమావేశంలో పాల్గొన్న జ్వాలా గుత్తా

## స్ఫూర్తిదాయకం మట్టిమనిషి పుస్తకం : డా. ఏనుగు నరసింహారెడ్డి

**రవీంద్రభారతి, ఆగస్టు 21 ప్రభాతవార్త :** మట్టిమనిషి ఒక స్ఫూర్తిదాయకమైన నవలని, ఇలాంటివి మరెన్నో రావాల్సిన అవసరముందని తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. బహుముఖ ప్రజ్ఞాశీలి డా. వాసిరెడ్డి సీతాదేవి వ్రాసిన నవలకు నాటకీకరణ అంటే ఆమె వామపక్ష భావాలచేత ప్రేరేపితమై వ్రాసిన నవల మట్టిమనిషి ఆమె ప్రతిభకు తార్కాణమన్నారు. మట్టిమనిషి అంటే మట్టిలోంచి వచ్చిన మనిషని కాకుండా మట్టి నుండి దూర మైపోయిన మనిషి ఎలా పతనమైపోతాడో తెలుపుతూ వ్రాసిన కథని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో మిత్ర క్రియేషన్స్ ఆధ్వర్యంలో సంస్థ ప్రధాన కార్యదర్శి ఎంఎస్.బాషా నిర్వహణలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో బి.ఎం.రెడ్డి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి విశిష్ట అతిథులు దెంచనాల శ్రీనివాస్, బొప్పన నరసింహారావు (బుజ్జి), ఆనంద్ ఆత్మీయ అతిథులతో కలిసి నవలామూలం డా. వాసిరెడ్డి సీతాదేవి నవలామూలం, వల్లూరు శివప్రసాద్ నాటక రచనలో వెలువడిన మట్టిమనిషి (నాటకం) పుస్తకాన్ని ఆవిష్కరించి తొలిప్రతిని వాసిరెడ్డి నారాయణరావును ఘనంగా సన్మానించి అందజేశారు. అనంతరం ప్రముఖులు ప్రముఖ సినీగేయ రచయిత డా. సుద్దాల అశోక్‌తేజ; ప్రముఖకవి, నాటక రచయిత అనంత్ చింతలపల్లి,, ప్రముఖ పద్యనాటక గాయకుడు, సంగీత దర్శకుడు యడవల్లి గంగాధర్‌లను ఘనంగా సత్కరించారు. సభకు ముందు నాట్యగురువు దివ్య శ్రీనివాస్ పర్యవేక్షణలో జనని సెల్వన్ భరతనాట్య ప్రదర్శన ఆహుతులను ఆహ్లాదపరిచింది.




మట్టిమనిషి పుస్తకావిష్కరణ గావిస్తున్న నరసింహారెడ్డి, అశోక్‌తేజ, బిఎం.రెడ్డి తదితర అతిథులు

## గంగానగర్ నాలా పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, ఆగస్టు 21 ప్రభాతవార్త**

గోల్నాక డివిజన్ గంగానగర్‌లో కొనసాగుతున్న నాలా నిర్మాణ పనులను శుక్రవారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పరిశీలించారు. నిర్మాణంలో ఉపయో గిస్తున్న స్టీల్, సిమెంట్ నాణ్యతను పరిశీలించి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూ చించారు. అనంతరం సంబంధిత కాంట్రాక్టర్‌ను స్వయంగా పనుల పురోగతి నాణ్యత, నిర్మాణ వివరాలపై అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఉపయోగపడే ఈ నాలా నిర్మాణ పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. న్యూగంగానగర్ బస్తీ వాసుల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉన్న నాలా పనులను సకాలంలో వేగవంతంగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు.



గోల్నాక గంగానగర్ నాలా నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**ఓటర్ల జాబితా పరిశీలించిన ఎమ్మెల్యే...**

అంబర్‌పేట్ నియోజకవర్గ ఓటర్ల జాబితాను ఎమ్మె ల్యే కాలేరు వెంకటేష్ స్వయంగా పరిశీలించారు. సర్ ప్రక్రియ అనంతరం నియోజకవర్గంలో రూపొందించిన ఓటర్ల జాబితాను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పరిశీ లించి బిఆర్ఎస్ నేతలతో చర్చించారు. ఓటర్ల వివ రాలు, జాబితాలో నమోదైన మార్పులు, కొత్తగా నమోదైన ఓటర్ల వివరాలను పరిశీలిస్తూ అధికారులు, పార్టీ నాయకులకు పలు సూచనలు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా, ఎలాం టి తప్పులు లేకుండా జాబితాను క్షుణ్ణంగా పరిశీ లించాలని సూచించారు

**నర్సింగ్‌యాదవ్ నివాసంలో వరలక్ష్మీ పూజలు...**

గోల్నాక డివిజన్‌కు చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయ కుడు నర్సింగ్‌యాదవ్ నివాసంలో వరలక్ష్మీ పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా నర్సింగ్‌యాదవ్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.



## జలమండలి పేరు వాడుకొని మోసం

**గచ్చిబౌలి, ఆగస్టు 21 ప్రభాతవార్త :** జలమండలి పేరును అనధికారి కంగా వాడుకుంటూ స్లడ్జ్, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ కార్య కలాపాలకు పాల్పడుతున్న వ్యక్తిపై మాదాపూర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు... ఏజీ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్స్ ప్రైవేట్ లిమిటె డ్‌కు చెందిన (టిజి08 వి6294) వాహ నం ఎటువంటి అనుమతి లేకుండా జలమండలి లోగో, పేరును వాడుకుంటూ స్లడ్జ్, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ పనులు నిర్వహి స్తుంది. జలమండలి పేరుతో ప్రజల ను తప్పుదారి పట్టించే విధంగా ఈ వ్యవహారం ఉండడంతో జలమ ండలి అధికారులు విషయాన్ని మాదాపూర్ పోలీసుల ద ృష్టికి తీసుకు వచ్చారు.దీనిపై విచారణ చేపట్టిన మాదాపూర్ పోలీసులు అనుమతి లేకుండా జలమంలి లోగో, పేరును ఉపయోగించి కార్యకలా పాలు నిర్వ హిస్తున్న సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనం యజమా ని మీద కేసు నమో దు చేసి దర్యాప్తు చేపట్టారు. జలమండలి లోగో, పేరు దుర్విని యోగం చేసే వారి మీద కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.